క్లుప్తంగా

రామన్నపాలెం కాలువ పూడికతీత పనులు


రామన్నపాలెం కాలువలో పూడిక తీస్తున్న రైతులు

నరసాపురం రూరల్: మండలంలోని యర్రంశెట్టివారిపాలెం శివారు ప్రాంత భూములకు సాగునీరు అందక రైతాంగం ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 150 ఎకరాల ఆయకట్టురైతులు ఆదివారం చేయి చేయి కలిపి శ్రమదానం చేసి రామన్నపాలెం మెయిన్ కెనాల్లో రామన్నపాలెం వద్ద కాలువలో పేరుకుపోయి ఉన్న మట్టి, తూడు తొలగించారు. ఫలితంగా రామన్న పాలెం ఛానల్ నుంచి సాగునీరు ఉధృతిగా శివారు ప్రాంతాల వరకూ ప్రవహించేందుకు అవకాశం ఏర్పడింది. ఈ తూడు, మట్టి తొలగింపు కార్యక్రమాన్ని ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ యర్రంశెట్టి బాబులు, కూనపరెడ్డి సూర్యనారాయణ, కట్టా వెంకటేశ్వర్లు, కూనపరెడ్డి శ్రీనివాస్ తదితరులు పర్యవేక్షించారు.

రేపటి నుంచి జీవధ్వజ స్తంభ మహోత్సవాలు

పెనుగొండ: స్థానిక నగరేశ్వర మహిషాసుర మర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో నూతన జీవ ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు ఈ నెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ వేడుకగా నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ బోర్డు చైర్మన్ కోట్ల మోహనరావు, ఈఓ జీఎస్ఎస్ శ్రీనివాస్‌లు తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ 7న జీవధ్వజ స్తంభ ప్రతిష్ఠ సంకల్పం, విఘ్నేశ్వర పూజ, గోపూజ, వాస్తు హోమాలు, ప్రాయశ్చిత హోమాలు, శాంతి హోమాలు, 8న ప్రతిష్ఠ హోమాలు, వాస్తు హోమాలు, ప్రధాన హోమాలు, ధాన్యాధివాసం, శయ్యాధివాసం, నీరాజన మంత్ర పుష్పాలు, 9న స్వస్తి వచనాలు, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రసన్న, రత్నన్యాసం, మహిషాసురమర్ధనీ సమేత వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవార్ల జీవ ధ్వజ స్తంభ ప్రతిష్ఠ, కల్యాణ మండప శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

మొగల్తూరు: ముత్యాలపల్లిలోఉన్న శ్రీబండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు బారులుతీరారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఆలయ ఈఓ డి.రామకృష్ణంరాజు, ఆలయ పాలక వర్గ చైర్మన్ కొల్లాటి రామారావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రహదారులకు మహర్దశ


అద్దంలా పెనుగొండ మార్టేరు రహదారి


శరవేగంగా పెనుగొండ దేవ మధ్యలో వేసిన సీసీ రోడ్డు

- వేగంగా రహదారుల నిర్మాణాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న వాహనచోదకులు

పెనుగొండ: గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన ప్రధాన రహదారులకు మోక్షం కలిగింది. ఆచంట నియోజకవర్గంలో ముఖ్యంగా పెనుగొండ-మార్టేరు, మార్టేరు- పెనుమంట్ర, పెనుగొండ-దేవ, సిద్ధాంతం- దొంగరావిపాలెం జాతీయ రహదారులు తీవ్ర నిర్లక్ష్యానికి గురి కావడంతో ప్రజలు నానావస్థలు పడేవారు. గతంలో ప్రజలు ఎన్ని వినతులు చేసినా ఆలకించే నాథుడే కరువయ్యారు. ముఖ్యంగా పెనుగొండ మార్టేరు రహదారి నిర్లక్ష్యానికి గురి కావడంతో పలువురు ప్రాణాలు సైతం పోగొట్టుకొన్నారు. గతంలో విస్తరించిన రహదారులు సైతం నాణ్యత లోపించడంతో రహదారులు మరీ అధ్వానంగా మారాయి. ఈ తరుణంలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ప్రత్యేక కృషి చేయడంతో నియోజకవర్గంలో రహదారులకు మహర్దశ ప్రారంభమైంది. అంతేకాకుండా రహదారులను అభివృద్ధి చేస్తుండడంతో ప్రజల ఇబ్బందులు తొలగుతున్నాయి,. రహదారులు అద్దంలా మెరుస్తున్నాయి.

పెనుగొండ మార్టేరు రహదారిని ఇప్పటికే రూ.5 కోట్లు వ్యయంతో పూర్తి చేశారు. మార్టేరు రామేశ్వరం రహదారి విస్తరణ పూర్తి చేశారు. తూర్పుపాలెంలో శేషమ్మ చెరువు రహదారి నిర్మాణం పూర్తయ్యింది. సిద్ధాంతం దొంగరావిపాలెం జాతీయ రహదారికి వెళ్లాలంటేనే ప్రజలు హడలి పోయేవారు. ఇప్పుడు అక్కడ కూడా సీసీ రహదారి నిర్మాణం పూర్తి చేశారు. దీంతో కూరగాయల టోకు మార్కెట్ వద్ద వ్యాపారులు, వాహనదారుల ఇబ్బందులు తొలగాయి.

శరవేగంగా పెనుగొండ దేవ రహదారి నిర్మాణం

దశాబ్ద కాలంకు పైగా నిర్లక్ష్యానికి గురైన పెనుగొండ దేవ రహదారి విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. పెనుగొండ ములపర్రు విస్తరణ, ఆచంట సిద్ధాంతం రహదారి నిర్మాణం రూ.15 కోట్లతో చేస్తున్నారు. ప్రస్తుతం పెనుగొండ దేవ గ్రామాల మధ్య వచ్చే గ్రామాల వద్ద సీసీ రహదారి నిర్మాణం పూర్తి చేశారు. సీసీ రహదారుల అనంతరం బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. వీటితో పాటు రహదారిలో ఏడు కల్వర్టుల నిర్మానం పూర్తి రైతులు ప్రజల ఇబ్బందులు తొలగించారు. వీటి నిర్మాణాలతో నియోజకవర్గంలో ప్రధాన రహదారుల సమస్యలు తీరినట్లేనని ప్రజలు ఆనందం వ్యక్తంచేస్తున్నా రు. నియోజకవర్గంలో రహదారులకు మహర్దశ కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ప్రధాన రహదారులకు మోక్షం



నియోజకవర్గంలో ప్రధాన రహదారులకు మోక్షం కలిగింది. మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు ప్రత్యేక కృషితో రహదారుల సమస్యలు తప్పాయి. ముఖ్యంగా తూర్పుపాలెం శేషమ్మ చెరువు రహదారి, పెనుగొండ మార్టేరు రహదారి నిర్మాణాలతో ప్రజలు ఇబ్బందులు తప్పాయి.

– గుబ్బల వీర బ్రహ్మం, ఆచంట ఏఎంసీ వైస్ ఛైర్మన్

గ్రామీణ ప్రాంతాల ప్రజల కృతజ్ఞతలు



పెనుగొండ దేవ రహదారి నిర్మాణంతో గ్రామీణ ప్రజల ఇబ్బందులు తొలగుతున్నాయి. ఆసుపత్రులకు వెళ్లాలంటే గోతుల్లో నానావస్థలు పడేవారు. చదువుకు, వైద్యానికి పెనుగొండ వెళ్లేవారు అధికం. ఇపుడు వారి అవస్థలు అన్నీ తప్పుతున్నాయి.

– తోలేటి శ్రీను, వైస్ ఎంపీపీ పెనుగొండ

నేటి నుంచి పునః ప్రతిష్టాపనోత్సవాలు

పెనుగొండ: స్థానిక జవ్వాది వారి వీధి కోదండ రామాలయ పునః ప్రతిష్టాపనోత్సవాలు సోమవారం నుంచి 8 వరకూ అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. డీసీసీబీ డైరక్టరు కూనపరెడ్డి లక్ష్మయ్య నాయుడు(నానాజీ) ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వివరించారు. 6న ఉదయం ప్రతిష్టా సంకల్పం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, దీక్షాదారుణ , చతుర్వేద పారాయణ, మధ్యాహ్నం 1 గంట నుంచి మేళతాళాలతో స్వామి వారి గ్రామోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. 7న పూజలు, హోమాలు, వాస్తు హోమాలు నిర్వహిస్తామని, 8న ఉదయం 7.01గంటలకు హనుమద్ లక్ష్మణ సీతా సమేత శ్రీరామచంద్రమూర్తి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తామని పేర్కొన్నారు. బ్రహ్మశ్రీ ఖండవల్లి సూర్యానారాయణాచార్యుల(రమణబాబు) శిష్య బృందం ఆధ్వర్యంలో దంపతులతో విగ్రహ ప్రతిష్టలు, హోమాలు, దీక్షలు నిర్వహించనున్నారు. ప్రతిష్టాపనోత్సవాలకు ముఖ్య అతిథిగా మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు పాల్గొంటారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

గ్రామ దేవతలకు చలిమోరు సమర్పణ

పాలకొల్లు అర్బన్: మండలంలోని ఉల్లంపర్రులో ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రామ దేవతలకు భక్తులు చలిమోరు సమర్పించారు. గ్రామదేవతలైన శ్రీ వేగులమ్మ, శ్రీ ముత్యాలమ్మ, శ్రీ గోగులమ్మ అమ్మవార్లకు గ్రామ పెద్దలు అల్లు శ్రీనివాసరావు–ఉమాదేవి దంపతులతో చలి విడి, పానకం, వడపప్పు సమర్పించారు. శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి కల్యాణోత్సవం సోమవారం రాత్రి 8:29 నిమిషాలకు జరగనుంది. దీనిలో భాగంగానే గ్రామంలోని సుహాసినీ స్త్రీలు, యువజనులు అమ్మవార్లకు చలిమోరు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ పెద్దలు ఎంఎస్ వాసు, రావాడ సతీష్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కనకదుర్గమ్మ ఆలయంలో లక్ష దీపాలంకరణ


శివలింగం ఆకారంలో దీపాలంకరణ


లక్ష దీపాలంకరణలో కనకదుర్గమ్మ ఆలయం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక యడ్లబజారు సెంటర్‌లో ఉన్న కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ఊంజల్ సేవ అనంతరం లక్ష దీపాలంకరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శ్రీ దుర్గామల్లేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాల్లో బాగంగా ఉదయం అమ్మవారికి ఇరగవరం వేద పండితులచే లక్ష కుంకుమార్చన పూజ కార్యక్రమాలు చేశారు. సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న పరమేశ్వరుని విగ్రహం వద్ద శివలింగం ఆకారంలో దీపాలను అలంకరించారు. భక్తులు అదిక సంఖ్యలో పాల్గొని దీపాలను వెలిగించారు.

సీఎం జగన్‌కు ఘన స్వాగతం


ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కుమార్తె వివాహ రిసెప్షన్‌కు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కాజ వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద స్వాగతం పలుకుతున్న మాజీ ఎమ్మెల్యే మేకా శేషుబాబు

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను స్వీకరిస్తామని సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ ఆదివారం విలేకరులకు తెలిపారు. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ దరఖాస్తులు అందించాలని కోరారు.

నేడు పాలకొల్లులో సీజ్ చేసిన వాహనాల వేలం

పాలకొల్లు సెంట్రల్: పట్టణ పోలీస్‌స్టేషన్లో ఎస్ఈబీ కేసుల్లో పట్టుబడిన ఐదు మోటర్ వాహనాలను వేలం నిర్వహించనున్నట్లు పట్టణ సీఐ డి.రాంబాబు ఆదివారం విలేకరులకు తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిర్వహించే వేలంలో ఆసక్తి కలిగిన వ్యక్తులు పాల్గొనాలని కోరారు.

వేగంగా నరసాపురం సుందరీకరణ పనులు



రైల్వేస్టేషన్‌రోడ్డులో డివైడర్ల వద్ద అధ్వానంగా ఉన్న దృశ్యం (ఫైల్)



నేడు అందంగా ఆధునికీకరించిన దృశ్యం

నరసాపురం: పట్టణ సుందరీకరణ విషయంలో మున్సిపల్ అధికారులు ఎట్టకేలకు దృష్టి పెట్టారు. పట్టణంలోని పల్లపు ప్రాంతాలను అందంగా తీర్చిదిద్దుతున్నారు. కొంత కాలంగా సుందరీకరణ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించారు. దీంతో ఎక్కడ పడితే అక్కడ రోడ్డు పక్కన పిచ్చిమొక్కలు, మట్టి దిబ్బలుగా దర్శనమిచ్చాయి. లాకులు నుంచి కొండాలమ్మ గుడి వరకూ గోదావరి గట్టు వెంబడి, అలాగే మత్స్యపురి వంతెన నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకూ పంట కాలువ వెంబడీ ప్లాట్ పామ్ నిర్మించి రెయిలింగ్ ఏర్పాటు చేశారు. అయితే అవన్నీ నిర్వహణ లోపం కారణంగా శిథిల మయ్యాయి. ఇక రైల్వేస్టేషన్ రోడ్డు, మిషన్ హైస్కూల్ రోడ్డులో నిర్మించిన డివైడర్లు కూడా శిథిలమయ్యాయి.

మారిన పరిస్థితి..

ఇటీవల కాలంలో కాటన్‌పార్కును అభివృద్ధి చేశారు, అలాగే పాడవతుతున్న ఏటిగట్టు పటిష్ట పరిచే పనులు శరవేగంగా సాగుతున్నాయి. అలాగే ఏటిగట్టు పొడవునా సుందరీకరణ పనులు కూడా చేపట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇక రైల్వేస్టేషన్‌రోడ్డులో వీధి దీపాలు ఆధునికీకరించారు. డివైడర్లను పూర్తిగా ఆదునీకరించి అందంగా తయారు చేశారు. మిషన్ హైస్కూల్‌రోడ్డులో కూడా డివైడర్లను ఆధునీకరించి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. దీంతో పట్టణం కొత్త అందాలను సంతరించుకుంది.

సుందరీకరణపై పూర్తిస్థాయిలో దృష్టి



పట్టణ సుందరీకరణపై పూర్తిస్థాయిలో దృష్టి పెడతాం. ముఖ్యంగా గోదావరిగట్టు పొడవునా అందంగా తీర్చిద్దిడానికి ప్రణాళిక తయారు చేస్తున్నాం. ఉదయం, సాయంత్రం వేళల్లో గోదావరి గట్టు వద్దకు విహారం కోసం పెద్ద ఎత్తున జనం వస్తున్నారు. గట్టు పొడవునా ఆహ్లాదకర వాతావరణం నెలకొనేలా చర్యలు చేపడతాం. పట్టణంలో ప్రధాన రహదారులను కూడా పునర్నిర్మిస్తున్నాం.

– బర్రి శ్రీ వెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్

విద్యార్థులు పోటీతత్వంతో చదవాలి


పోడూరులో యూటీఎఫ్ టాలెంట్‌టెస్ట్‌కు హాజరైన విద్యార్థులు

పోడూరు: విద్యార్థులు పోటీతత్వంతో చదవాలని యూటీఎఫ్ అధ్యక్షులు డి.క్షేమమూర్తి పిలుపునిచ్చారు. యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పోడూరు జెడ్పీహైస్కూల్లో 5, 10 తరగతుల విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు క్షేమమూర్తి, కె.నాగరాజులు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు దగ్గరలో ఉన్నందున విద్యార్థులు ఎక్కువ సమయం చదువుకు కేటాయించాలని, ఎలాంటి ఆందోళనకు గురికాకుండా శ్రద్ధగా చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించే లక్ష్యంతో ప్రతీఏటా యూటీఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏకేవీ రామభద్రం, జిల్లా గౌరవాధ్యక్షులు మార్కండేయులు, యూటీఎఫ్ నాయకులు తాళాబత్తుల వెంకటేశ్వరరావు, ఎంవీ రాజశేఖర్, బి.శేషగిరిరావు, కె.దుర్గాప్రసాద్, కె.శిరీషా, ఎం.సత్యవాణి, హెచ్ఎం ఐ.జనార్ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

పూరిపాక దగ్ధం


మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మొగల్తూరు: స్థానిక పెద్దమిల్లు రోడ్డులో కాలువ గట్టున ఉన్న పూరిపాక దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం కాలువ గట్టున ఉన్న పూరిపాకలో ఆదివారం మధ్యాహ్నం సమయంలో మంటలు రావడంతో స్థానికులు స్పందించి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అయితే మంటలు అదుపులోకి వచ్చినా పక్కనే ఉన్న టాక్సీ స్టాండ్‌కు కూడా మంటలు వ్యాపించడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది మంటలను పూర్తిగా అదుపు చేశారు. టాక్సీ స్టాండ్‌లో ఉన్న కుర్చీ, సీలింగ్ ఫ్యాన్ మాత్రమే మంటలకు కాలిపోయాయి. ఎలాంటి ప్రాణ, ఆస్థి నష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

పెద్దింట్లమ్మ ఆలయం వద్ద అన్నసమారాధన

పెనుగొండ: గ్రామంలోని అడ్డపుంతలోని పెద్దింట్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి పూజలు నిర్వహించిన అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. పెనుగొండ పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 10 వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.